ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు

మహోత్సవానికి హాజరవుతున్న చినజీయర్ స్వామికి ఘనంగా స్వాగతం పలుకాలి • హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, మే 20: పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 22న జరుగబోయే ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులకు సూచించారు. అలాగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు హుజూరాబాద్‌కు తొలిసారి వస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామికి ఘనంగా స్వాగతం పలకాలని భక్తులకు పిలుపునిచ్చారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈనెల 21 నుంచి 23 వరకు ఉత్సవాలు జరుగనుండగా, మంగళవారం ఆలయ పరిసరాల్లో చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేయాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, వైద్యం వంటి సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, టౌన్ సీఐ కరుణాకర్, విద్యుత్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, పూర్ణచందర్, ముత్యం రాజు, రమేశ్, ఇతర నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్ కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, కమలాపూర్, హుజూరాబాద్ మండలాలు, జమ్మికుంట, హుజూరాబాద్ పట్టణాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు 15 లక్షల 69 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ హుజూరాబాద్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణీసురేందర్ రెడ్డి, నాయకులు మొలుగు పూర్ణచందర్, కొండ్రు నరేశ్, కొలిపాక నవీన్, యాదగిరి నాయక్, వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానంది అవార్డు గ్రహీతకు కేంద్రమంత్రి అభినందన

ఆయుర్వేద వైద్యురాలు యమునను అభినందిస్తున్న బండి సంజయ్

విద్యానగర్, మే 20: విశాఖపట్నానికి చెందిన ఏఎన్ఎస్ 24 టీవీ సంస్థ ఉగాది పురస్కారాల్లో భాగంగా కరీంనగర్‌కు చెందిన కాలభైరవ ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు యమునకు మహానంది పురస్కారం 2025 ఇటీవల ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అభినందించి శాలువాతో సత్కరించారు. నిరుపేదలకు ఆయుర్వేద వైద్యాన్ని యమున ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. వైద్యసేవలను విస్తృత పరుస్తూ మరింత మంది పేదలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ బాధ్యుడు కోల అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

- కరీంనగర్ జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మే 20 : పోలీసు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, జిల్లాను మాదక ద్రవ్య రహితంగా మార్చి రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులదేనన్నారు. డ్రగ్స్ మూలాలను పెకిలించి వేయాలని సూచించారు. కళాశాలలు, వసతి గృహాలను సందర్శిస్తూ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం తెస్తూ, పెడదోవ పట్టకుండా చూడాలన్నారు. డ్రగ్స్ నిర్ధారణ కిట్లను తెప్పించి, రానున్న రోజుల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం మూలంగా జరిగే అనర్థాలపై జిల్లాలో 252 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 20,912 మందిలో చైతన్యం నింపినట్లు వెల్లడించారు. 2022 నుంచి ఇప్పటి వరకు 122 కేసులు నమోదు చేయగా, 115 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, ఏసీపీ మాధవి, డీడబ్ల్యూవో ఎం.సరస్వతి, నెహ్రూయువకేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, సీఐలు రాము, బాబు, పుల్లయ్యతోపాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

భూ భారతితో సమస్యల పరిష్కారం: మంత్రి పొంగులేటి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

సైదాపూర్, ఏప్రిల్ 20: భూ భారతితో భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఆయన రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని 13 రెవెన్యూ గ్రామాలకు గానూ 1600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. న్యాయమైన సాదా బైనామాలు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారమవుతాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికీ ఒక రెవెన్యూ అధికారిని జూన్ 2నుంచి నియమించబోతున్నామని చెప్పారు. అదే రోజు నుంచి ప్రతి గ్రామానికి తహసీల్దార్ స్థాయి అధికారి వచ్చి మీ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌష్ ఆలం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఆటో ఆకలి కేకల మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులు

తెలంగాణచౌక్, మే 20 : కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మద్దె రాజేందర్, నగర కమిటీ సభ్యులతో కలిసితో ఈ నెల 27 హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ఆటో ఆకలి కేకల మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లకు కిరాయి లభించక ఆర్థిక ఇబ్బందులతో జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ నాయకులు ఆటో డ్రైవర్ల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. లక్షల మంది ఆటో రంగం మీద ఆధారపడి జీవిస్తున్నారని, వారిందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆటో డ్రైవర్ల పోరాటానికి బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, సత్యనారాయణ, ప్రభాకర్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, మే 20 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరైన నలుగురు, శివాని డిగ్రీ కళాశాలలో ఒకరు, వాణీనికేతన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డట్లు వివరించారు.

నూతన నియామకం

కరీంనగర్ రూరల్, మే 20: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ రూరల్ మండలాధ్యక్షుడిగా లింగంపల్లి మోక్షిత్ నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ నియామక పత్రం అందజేశారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా తప్పట్ల రాజు, గాలిపల్లి రవీందర్, ఉపాధ్యక్షులుగా బుచ్చల అనిల్, దావు మల్లేశ్, మోగదుంపల్లి అనిల్, తప్పట్ల విఠల్, కార్యదర్శులుగా ఆలువాలా ప్రశాంత్, చామనపల్లి గణేశ్, దావు శ్రీనివాస్, తాండ్ర ధృవకుమార్, కాసాపాక ఉమేశ్, వడ్లూరి శ్రీకాంత్, కోశాధికారిగా ఇరుగురాల వెంకటేశ్, ప్రచార కార్యదర్శిగా విజయ్‌కుమార్‌ను నియమించినట్లు వెల్లడించారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు.

వేగంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం

గంగాధర, మే 20 : మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ హౌస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారులు ముగ్గుపోసి పోయగా పునాదుల వద్ద పనులు నిలిచిపోయాయి. దీంతో 'నత్తనడకన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం' శీర్షికతో గతంలో 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. వెంటనే స్పందించిన అధికారులు మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించగా, ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి.

ఆశ కార్యకర్తల నిరసన

మానకొండూర్: మానవ మారంగా ఏర్పడి నిరసన తెలుపుతన్న ఆశ కార్యకర్తలు

మానకొండూర్, మే 20: కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్లతో మండలంలోని ఆశ కార్యకర్తలు మంగళవారం మానకొండూర్ మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు. కరీంనగర్– వరంగల్ రహదారిపై స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మానవ హారంగా ఏర్పడి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కే రోజా, కవిత, ప్రమీల, బీ మంజుల, లక్ష్మి, ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గంగాధర, మే 20 : మండలంలోని నారాయణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇస్తారిపల్లికి చెందిన కళ్లెం నారాయణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. నారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ సర్పంచులు ఎండీ నజీర్, మడ్లపెల్లి గంగాధర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

తెలంగాణచౌక్, మే 20: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం పలు కంపెనీల ఎదుట నిరసన ప్రదర్శనలను చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని రంగాల్లో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతున్నదన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూరేలా కేంద్రం పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా పాలన కొనసాగిస్తున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, మహేందర్, శ్రీలత, రజిత, కవిత పాల్గొన్నారు.

జూన్ 20లోగా స్కావెంజర్ల సర్వే నివేదిక అందజేయాలి

కలెక్టరేట్, మే 20 : జిల్లాలో అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, మాన్యువల్ స్కావెంజర్ల సర్వే నివేదికను జూన్ 20లోగా అందజేయాలని, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. జిల్లాస్థాయి సర్వే కమిటీ సమావేశం మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈసందర్భంగా మాన్యువల్ స్కావెంజర్స్ రిహాబిలిటేషన్ చట్టం 2013 ప్రకారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి, సబ్ డివిజనల్ స్థాయి సర్వే కమిటీలు నెలలోగా సర్వే పూర్తి చేసి, సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పించాలన్నారు. సమావేశంలో షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధి అధికారి పవన్‌కుమార్, సీపీవో వి.కిషన్‌రావు, డీపీవో జగదీశ్వర్, జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి మున్సిపల్ కమిషనర్లు అయాజ్, సమ్మయ్య, నాగరాజు, నాన్ అఫీషియల్ సభ్యులు వీరమాధవ్, కె.వెంకటయ్య, పి.సూర్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాల్సిందే

కమాన్‌చౌరస్తా, మే 20 : రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘాలు విద్యాహక్కు చట్టాన్ని తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ నిబంధనలను కూడా పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాలలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలలో తప్పనిసరిగా విద్యా హక్కు చట్టం అమలు చేయాలని, అర్హత గల 25 శాతం విద్యార్థులకు ఉచితంగా విద్యను ఇవ్వాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందుకున్న ప్రసాద రావు

ఫిన్‌లాండ్‌లో ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రసాద రావు

కమాన్‌చౌరస్తా, మే 20 : ఫిన్‌లాండ్ దేశంలో భారత దేశ రాయబారిగా పని చేస్తున్న హేమంత్ హెచ్ కోటక్వార్ నుంచి పారమిత, ఎక్స్ ప్లోరికా విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ ప్రసాదరావు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందుకున్నారు. ఆధునిక విద్యా వ్యవస్థను పరిశీలించడానికి ఫిన్‌లాండ్ దేశాన్ని ఆయన సందర్శిస్తున్నారు. భారత దేశం నుంచి 20 మంది సభ్యుల బృందం ఫిన్‌లాండ్ పర్యటిస్తూ అక్కడి విద్యా వ్యవస్థను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో ప్రపంచ ప్రమాణాలతో కొనసాగుతున్న ఈ విద్యా విధానాన్ని పారమిత, ఎక్స్ ప్లోరికా పాఠశాల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశ పెట్టబోతున్నట్లు ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు ఫిన్‌లాండ్ దేశంలో భారత దేశ రాయబారి హేమంత్ హెచ్ కోటక్వార్ నుంచి ఆయన సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందుకున్నారు.

కవి మేరుగు అంజయ్య మృతి

అంజయ్య (ఫైల్)

కమాన్‌చౌరస్తా, మే 20 : తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యదర్శి మెరుగు అంజయ్య దవాఖానలో చికిత్స పొందుతూ, గుండెపోటుతో మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన శంకరపట్నం మండలం మెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. దశాబ్ద కాలంగా తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యవర్గంలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఆయన మృతికి తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్ దామరకుంట శంకరయ్య, కవులు నలిమెల భాస్కర్, నగునూరి శేఖర్, గాజోజు నాగభూషణం, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య తదితరులు సంతాపాన్ని తెలిపారు. మెరుగు అంజయ్య కుమారుడు అమెరికాలో ఉన్నందున అంత్యక్రియలు రెండు రోజులు ఆలస్యంగా జరుగుతాయని, మృతదేహాన్ని చల్మెడ హాస్పిటల్‌లో ఫ్రీజర్‌లో భద్ర పరిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్ రూరల్, మే 20: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీఎస్ఎస్‌పీ టీం లీడర్ అక్రమ్ సూచించారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ క్యాంప్‌లో మంగళవారం క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఏ.కే. జయంత అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ్.. సైబర్ క్రైమ్స్‌లో రకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి వివరించారు. ఏదైనా అనుమానిత సైబర్ క్రైమ్ యాక్టివిటీ జరిగినట్లు గమనిస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని, లేదా సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి మేజర్ డాక్టర్ కే. రవీంద్రబాబు, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్ , సుబేదార్ సూర్య ప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు, శిక్షణ పొందుతున్న కెడెట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ప్రారంభం

కమాన్‌చౌరస్తా/మానకొండూర్/కరీంనగర్ రూరల్/సైదాపూర్, మే 20 : జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు ఐదు రోజుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. నగరంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో గంగాధర మండల సెకండరీ గ్రేడ్ టీచర్స్‌కు నిర్వహించిన మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో జూమ్ మీటింగ్ ద్వారా విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా మాట్లాడుతూ, ఉపాధ్యాయులందరూ సబ్జెక్టుపై నైపుణ్యాన్ని పెంచుకొని, పిల్లలకు నేర్పించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న గంగాధర మండల విద్యాధికారి ప్రభాకర్ రావు.. విద్యా వాహిని బడిబాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే మానకొండూర్‌లోని జడ్పీహెచ్ఎస్ (బాలురు)లో, కరీంనగర్ రూరల్ మండలంలోని సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు సెయింట్ జార్జి ఇంటర్నేషనల్ పాఠశాలలో, సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్స్‌గా వ్యవహరిస్తున్న ఆయా మండలాల విద్యాధికారులు మాట్లాడుతూ, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా సబెక్టుల రిసోర్స్ పర్సన్స్ వివిధ సబెక్టుల నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

నూతన తహసీల్దార్‌గా రజిత

వీణవంక, మే 20: మండల నూతన తహసీల్దార్‌గా అంబటి రజిత బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ నిజామొద్దీన్, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. వీణవంకలో తహసీల్దార్‌గా పని చేసిన మంజుల సైదాపూర్‌కు బదిలీపై వెళ్లగా, పెద్దపల్లిలో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ రజిత ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, భూ సమస్యలను నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని, దళారులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్ రావు ఫౌండేషన్ ఔదార్యం

ఆర్థిక సాయం చేస్తున్న బీఎన్‌రావు

విద్యానగర్, మే 20: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, పకీర్ కొండాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ అనే యువకుడికి కొంతకాలంగా లివర్ రక్తనాళంలో ప్రసరణ మందగించడంతో నిమ్స్‌లో వైద్య చికిత్స కోసం డాక్టర్ బి.ఎన్.రావు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించారు. కోరుట్లకు చెందిన డాక్టర్ అనుప్‌రావు రోగి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని స్వయంగా రూ.20 వేలు సాయం చేయడంతోపాటు బీఎన్ రావు ఫౌండేషన్‌కు తెలపడంతో.. డాక్టర్ బి.ఎన్.రావు 20వేల రూపాయల చెక్కును మంగళవారం శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ డాక్టర్ బి.ఎన్.రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మేలైన సాగు పద్ధతులపై అవగాహన

మానకొండూర్ రూరల్, మే 20: అన్నారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉషారాణి రైతులకు సాగుకు సంబంధించిన అంశాలపై వివరించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆక్యుపంక్షర్ ద్వారా శరీరం స్వయం చికిత్స

శంకరపట్నం, మే 20: ఆక్యుపంక్షర్ వైద్య విధానంతో శరీరం తనకు తానే రోగాలను నయం చేసుకోగలదని వైద్యులు తెలిపారు. మంగళవారం కేశవపట్నం ఉన్నత పాఠశాలలో ఆక్యుపంక్షర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురు రోగులకు హీలిం